క్లుప్తంగా

'జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మరణం బాధాకరం'

నిర్మల్‌చైన్‌గేట్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగం టి గోపినాథ్ అకాల మరణం బాధాకరమని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వారి మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థించి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా బీరప్ప పండుగ



పూజలు చేస్తున్న కురుమ సంఘం సభ్యులు

కుంటాల: మండలంలోని లింబా(కె)లో ఆదివారం బీరప్ప పండుగను కురుమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

త్వరలో రైతుల ఖాతాల్లో జొన్నల డబ్బులు

కుంటాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు విక్రయించిన రైతులకు త్వరలో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం కుంటాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జొన్నలు అమ్మి నెల గడుస్తున్నా.. డబ్బులు రాకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను మార్క్‌ఫెడ్ ఎండీ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఆయన స్పందించి వారంలోగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం, వెంగల్‌రావు, బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్, అన్నం భూమన్న తదితరులు ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ



ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులు

నిర్మల్: వేసవిసెలవుల్లో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరం ముగిసినట్లు నృత్యశిక్షకులు గొనుగొప్పుల రాజశేఖర్, రాము పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని శేఖర్ డ్యాన్స్ స్టూడియోలో 45రోజుల పాటు వెస్టర్న్, క్లాసికల్, ఫోక్ తదితర అంశాల్లో డ్యాన్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం శిబిరం ముగింపు సందర్భంగా విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందించారు.

వాహనాలు తనిఖీ

ముధోల్: మండలకేంద్రంలోని ముధోల్–తరోడా ప్రధాన రహదారిపై ఆదివారం ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ధ్రువపత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై పేర్కొన్నారు.

పరామర్శ

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో మాజీ సర్పంచ్ గణేశ్ తండ్రి ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకొని ఓదార్చారు.

ఉమ్రి(కే)లో వైద్యశిబిరం

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామ పాఠశాల ఆవరణలో ఆదివారం భైంసా శ్రీకార ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ దయానంద్‌రెడ్డి వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శృతిరెడ్డి సిరం, మాజీ సర్పంచ్ మారోతి, సిబ్బంది గౌతం, నారాయణ్‌రావ్ పటేల్, దిగాంబర్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ



పతకాలతో క్రీడాకారులు

నిర్మల్‌టౌన్: జాతీయస్థాయి అండర్–17 బాయ్స్ అండ్ గర్ల్స్ బాక్సింగ్ పోటీలను జూన్ 4నుంచి 8వరకు గోవాలోని మాపూసలో నిర్వహించారు. పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఏడుగురు బాలికలు పాల్గొనగా, ఇందులో నిర్మల్ నుంచి ఇద్దరున్నారు. వీరిలో ఏ కీర్తన (46–48), అభినయ (54–46) వెయిట్ కేటగిరీల్లో సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ చందుల స్వామి, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి వీరిని అభినందించారు.

సారూ..బడిని తెరిపించండి

- 2015–16లో కుప్టి మరాఠీ పాఠశాలను మూసివేసిన అధికారులు
- సరిహద్దు ప్రాంతంలో చదువుకు దూరంగా పేదింటి పిల్లలు
- సమస్య పరిష్కరించాలంటున్న పోషకులు



మూతబడిన పాఠశాల భవనం వద్ద పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం

తానూరు: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో సర్కారు బడుల్లో ప్రైవేటుకు ధీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామంటూ పాలకులు, అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పలు చోట్ల పరిస్థితి భిన్నంగా ఉంది. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో తానూరు మండలంలోని వడ్‌గాం పంచాయతీ పరిధి కుప్టి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(మరాఠీ మీడియం)ను విద్యార్థులు లేరంటూ 2015–16 విద్యాసంవత్సరంలో మూసివేశారు. దీంతో ఈ గ్రామంలోని సుమారు 40 మంది చిన్నారులకు ప్రాథమిక విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ప్రస్తుతం ఈ గ్రామంలోని విద్యార్థులు రెండు కిలోమీటర్లు కాలినడకన వడ్యాల్ ఎక్స్‌రోడ్డు వద్దకు వెళ్లి అక్కడ నుంచి వాహనాల్లో తానూరు వెళ్లి చదువుకుంటున్నారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల తిరిగి ప్రారంభించి ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో తమ పిల్లలకు చదువు చెప్పాలని కుప్టి గ్రామస్తులు వేడుకుంటున్నారు.

గతంలో మరాఠీ పాఠశాల..

తానూరు మండలంలోని వడ్‌గాం పంచాయతీ పరిధి కుప్టి గ్రామం మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉంటుంది. ఇక్కడ మొత్తం 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గత దశాబ్దకాలంగా ఇక్కడ మరాఠీ భాషలో విద్యాబోధన సాగేది. అయితే స్థానికంగా మరాఠీ ఉన్నత చదువుల అందుబాటులో లేకపోవడంతో పేదకుటుంబాల విద్యార్థులు చదువు మానేసి వ్యవసాయ పనులకు వెళ్లేవారు. మరికొందరు పశువుల కాపరులుగా కొనసాగేవారు. ఆర్థికంగా ఉన్న వారు మహారాష్ట్రలోని కళాశాలల్లో చేరి విద్యనభ్యసించేవారు.

విద్యాహక్కు చట్టం ప్రకారం..

కనీసం 20 మంది విద్యార్థులు ఉన్న ప్రాంతంలో కిలోమీటర్ లోపు ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లలోపు ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్లలోపు ఉన్నత పాఠశాల ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది.

ఇక్కడ చదివితే మహారాష్ట్రలో నాన్‌లోకల్..

అయితే ఇక్కడ ప్రాథమిక విద్య పూర్తిచేసినవారు తెలంగాణ రాష్ట్రంలో లోకల్‌గా పరిగణించబడుతారు. మహారాష్ట్రలో ఉన్న ఉద్యోగాలకు నాన్‌లోకల్ కోటాలో దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఇటు తెలంగాణ మరాఠీ మీడియంలో చదివిన వారికి ఉద్యోగాల్లేకపోవడం.. అటు మహారాష్ట్రలోనూ నాన్‌లోకల్ కోటాలో పోస్టులు తక్కువ ఉండటంతో ఉద్యోగాల ఎంపికకు ఇబ్బంది పడేవారు.

ఆంగ్లం, తెలుగు మీడియంలో బోధించాలి..

2015–16లో మూతబడిన పాఠశాలను తిరిగి ప్రారంభించలేదు. ప్రస్తుతం ఒక అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఈ పాఠశాలలో ఆంగ్లమాధ్యమంలో విద్యనందిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. అధికారులు మూతపడిన పాఠశాలలను తిరిగి ప్రారంభించి విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు మాధ్యమంలో విద్యనందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో పాఠశాలను ప్రారంభిస్తే విద్యార్థులకు దూరభారం తగ్గి సౌకర్యవంతంగా ఉండేదని గ్రామస్తులు వాపోతున్నారు.

చదువుకు దూరమవుతున్నారు



కుప్టిలో విద్యార్థులు లేరని పాఠశాలను అధికారులు మూసివేశారు. ఆర్థికంగా ఉన్నవారు పట్టణాల్లో ప్రైవేటు స్కూళ్లలో చదివిస్తున్నారు. పేద కుటుంబాల పిల్లలు మాత్రం చదువుకు దూరమవుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ ఏడాదైన పాఠశాలను తిరిగి ప్రారంభించాలి.

– గణేశ్, గ్రామస్తుడు

కాలినడకన వెళ్తున్నారు



మా గ్రామానికి రవాణా సౌకర్యం లేదు. మా చిన్నారులు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వడ్‌గాం ఎక్స్‌రోడ్డుకు కాలినడకన వెళ్లి చదువుతున్నారు. మరికొందరు పేదవిద్యార్థులు తల్లిదండ్రులతో వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఈ ఏడాది పాఠశాలను పునఃప్రారంభించి మా సమస్య పరిష్కరించాలి.

– మొరే గోవింద్‌రావ్ పటేల్, స్థానికుడు

విద్యార్థులుంటే ప్రారంభిస్తాం



విద్యార్థుల్లేక కుప్టి గ్రామంలో ప్రాథమిక పాఠశాల మూతబడిన మాట వాస్తవమే. త్వరలో గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడుతాం. విద్యార్థులుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. తెలుగు, ఆంగ్లం మాధ్యమంలో తరగతులను ప్రారంభించి సమస్య పరిష్కరిస్తాం.

– నరేందర్, ఎంఈవో

సర్కారు బడుల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రచారం



భాగ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



మామడ : పొన్కల్‌లో కరపత్రాలతో ప్రచారం..



మాటేగాంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు



సోన్ : మాదాపూర్‌లో..

నిర్మల్‌రూరల్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఉపాధ్యాయులు ఇళ్లకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. జిల్లాకేంద్రంలోని రామ్‌నగర్ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఆదివారం నీలాయపేటతండా, భాగ్యనగర్, మొండిగుట్ట గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తుకారాం, ఉపాధ్యాయులు గజ్జారాం నాందేవ్, వసంతరావు, దూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: సర్కారు బడుల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందని గోసంపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. ఆదివారం మండలంలోని గోసంపల్లిలో బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, తిరుమల, రవీంద్ర రెడ్డి, రాణి, సునీత, ప్రవళిక తదితరులు ఉన్నారు.

సోన్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో నిర్వహించిన బడిబాటలో జిల్లా విద్యాశాఖ సమన్వయ కర్త, కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, వెంకన్న సీహెచ్. విద్యాసాగర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పార్‌పెల్లిలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ పోషకులకు సర్కారు బడి గురించి వివరించారు. హెచ్‌ఎం మోహన్, లక్ష్మణ చాంద పాఠశాల హెచ్‌ఎం రాజునాయక్, ఉపాధ్యాయులు అశోక్, గంగసురేశ్, ఆదిల్, పోశెట్టి పాల్గొన్నారు.

కరపత్రాలతో ప్రచారం

మామడ: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పొన్కల్ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. పొన్కల్‌లో ఆదివారం బడిబాటలో భాగంగా సర్కారు బడుల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించే కరపత్రాలతో ప్రచారం చేశారు. వీడీసీ సభ్యులకు, బ్యాంకులకు వచ్చేవారికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని మాటేగాం గ్రామంలో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సర్కారు బడుల్లో అందిస్తున్న సౌకర్యాలపై పోషకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణారావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సన్మానం



సన్మానగ్రహీతలతో మరాఠా సంఘం నాయకులు

బాసర: చదువులో రాణించిన మండలకేంద్రానికి చెందిన నలుగురిని మరాఠా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. సచిన్ పటేల్ (ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్), ఐఐటీ సీట్లు సాధించిన జాదవ్ రుగ్వేద్ పటేల్, బాపూజీ అశ్విత్ పటేల్‌తోపాటు ఎంసెట్‌లో 1922వ ర్యాంకు సాధించిన మనోజ్ పటేల్‌ను శాలువాలతో సన్మానించి సరస్వతి అమ్మ వారి ప్రసాదం అందించారు. కార్యక్రమంలో మరాఠా సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, ఉపాధ్యకులు జ్ఞానేశ్వర్ పటేల్, శంకర్‌రావ్ పటేల్, గంగాధర్ పటేల్, సూర్యకాంత్ పటేల్, యోగేశ్వరరావు, నారాయణ పటేల్, గణేశ్ జాదవ్ పటేల్, బాలుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

నిర్మల్‌రూరల్: మండలంలోని న్యూపోచంపాడు గ్రామంలో నడికుడ పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇతర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కల్గకుండా వసతులు కల్పించారు.

నల్లమేకల పండుగ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో నల్లమేకల పండుగ నిర్వహించా రు. ఆదివారం వీడీసీ, కులసంఘాల ఆధ్వర్యంలో కెనాల్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు శ్రీనివాస్, అశోక్, విజయ్, భూమేశ్, చిన్నారెడ్డి, సురేశ్, మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యశాల

ఖానాపూర్: ప్రధాని మోదీ 11 ఏళ్ల బీజేపీ స్వపరిపాలనతోపాటు యోగా దివస్, ఎమర్జెన్సీ అనే అంశాలపై పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో సోమవారం బీజేపీ కార్యశాల నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కీర్తి మనోజ్, రమేశ్, శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ జిల్లా శాఖ ఆదేశాల మేరకు నిర్వహించే కార్యశాలకు పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యశాలకు వక్తగా మాజీ ఎంపీటీసీ జక్కుల సత్తయ్య యాదవ్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలి

బాసర:మండలంలోని రేణుకాపూర్ పంచాయతీ కార్యాలయంలో సోమవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పవన్ చంద్ర అన్నారు. భూసమస్యలున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

బాసర:మండలంలోని కిర్గుల్(బి) గ్రామంలో ఆదివారం మారెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. భక్తులు గోదావరి నీటితో అమ్మవారి ప్రతిమకు అభిషేకం, అర్చన చేశారు. మాజీ ఎంపీపీ సాయిబాబా, బీఆర్ఎస్ నేత బెజ్జంకి లక్ష్మారెడ్డి, సాహెబ్‌రావు, పటేల్, సాయిలు, అశోక్ పాల్గొన్నారు.

బీరు సీసాలో నాచు



భైంసారూరల్: ఓ కంపెనీకి చెందిన బీరు సీసా లోపల నాచు వచ్చింది. ఆదివా రం మండలంలోని వానల్‌పాడ్‌లోని బెల్ట్ షాపులో ఓ బీరును వినియోగదారుడు కొని తాగుతుండగా నాచు కనిపించింది. వెంటనే పక్కన పెట్టేశాడు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ నజీర్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలో పేకాట ఆడుతున్న తొమ్మిదిమందిని అరెస్ట్ చేసినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక చినాయ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో రాజన్న హోటల్ పక్కన ఓ దుకాణంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై సుప్రియ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ముత్తవార్ చంద్రకాంత్, పుల్లోల్ల హన్మాండ్లు, కదం సదానంద్, జోగదాండే సాయినాథ్, బట్టు భోజన్న, బొమ్మిడి గంగాశేఖర్, జాదవ్ సుధాకర్, సోమేశ్వర్ శివప్రసాద్, లింగురామోల్ల అశోక్ పేకాట ఆడుతూ పట్టుబడినట్లు వివరించారు. ఈ మేరకు వారి నుంచి రూ.20,050 నగదు, 9 సెల్‌ఫోన్లు, ఆరు బైక్‌లు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడిలో కానిస్టేబుళ్లు అంబదాస్, సిబ్బంది ఉన్నారు.

జిల్లా యూనిట్‌గా సర్దుబాటు చేయాలి



మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయులను జిల్లా యూనిట్‌గా సర్దుబాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు, విద్యార్థులు ఎక్కువ ఉన్న చోట మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తర్వాతనే పక్క మండలాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. అదేవిధంగా జెడ్పీ ఉన్నత పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులను జిల్లా యూనిట్‌గా సర్దుబాటు ప్రక్రియ చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘం నేతల సలహాలు, సూచనలు స్వీకరించేలా సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. గతంలో అరకొరగా సర్దుబాటు చేయడంతో మారుమూల మండలాలైన పెంబి, దస్తురాబాద్, కడెం మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని.. ఈసారి గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వారి వెంట పలువురు ఉన్నారు.

సంబురంగా అపూర్వ సమ్మేళనం



భైంసాలో సమావేశమైన పూర్వవిద్యార్థులు



నిర్మల్ ఎస్ఆర్‌కే హైస్కూల్ పూర్వవిద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. భైంసాలోని జేఆర్ఎం హైస్కూల్‌కు చెందిన 2002–03 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరి చిన్ననాటి మిత్రులతో సరదాగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుండ్లిక్‌రావ్, అరవింద్, పోతాజి, లక్ష్మణ్, వెంకట్‌రావు, ముస్తాక్, సంతోష్ తదితరులున్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఉత్సవ్ బాంకెట్ హాలులో నిర్మల్ ఎస్ఆర్‌కే హైస్కూల్‌లో 1997–98లో పదోతరగతి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27 ఏళ్ల తర్వాత కలుసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సమావేశంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి'

ఖానాపూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు కె.తిలక్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టుకున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయకుండా ప్రభుత్వం వెంటనే కోర్టులో హాజరుపరచాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట చేస్తున్న ఎన్‌కౌంటర్లను తెలంగాణ జనసమితి పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబాలకు వెంటనే అప్పగించాలని కోరారు.

జలశక్తి పనుల పరిశీలన



నచ్చన్‌ఎల్లాపూర్‌లో పరిశీలిస్తున్న సభ్యులు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్, కొండుకూర్ తదితర గ్రామాల్లో జలసంచాయ్ సెంట్రల్ టీం సభ్యులు పర్యటించారు. ఇంకుడుగుంతలు, కమ్యూనిటీ రూఫ్‌టాప్, ఓపెన్‌వెల్స్, చిన్న నీటికుంటలు, ట్రెంచ్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పలు వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇందులో జలసంచాయ్ టీం సభ్యులు సతీశ్, డీఆర్పీ గంగాప్రసాద్, సందీప్, ఏపీవో జయదేవ్, టీఏలు కాంతారావు, గణేశ్ తదితరులు ఉన్నారు.

కాలిపోతున్న పచ్చదనం



మండలకేంద్రంలో కాలుతున్న చెట్లు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో చెట్లు కాలిపోతున్న ఘటన చోటు చేసుకుంది. మండలంలోని కనకాపూర్ నుంచి లక్ష్మణచాంద వెళ్లే డబుల్‌రోడ్డుకు ఇరువైపులా అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన రెండు వేల మొక్కలు నేడు చెట్లుగా మారి ప్రయాణికులకు ఆహ్లాదం పంచుతున్నాయి. కానీ ఈ చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి కాలుస్తున్నారు. ఇటీవల మండలకేంద్రం నుంచి చామన్‌పెల్లి వెళ్లే మార్గంలో మొక్కలను నరికేసిన గుర్తు తెలియని వ్యక్తులపై చర్య తీసుకోవాలని లక్ష్మణచాంద పంచాయతీ కార్యదర్శి రాకేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై శ్రీనివాస్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా సమీప రైతుల వద్దకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆదివారం మళ్లీ పొట్టపెల్లి–లక్ష్మణచాంద మధ్య ఉన్న హరితహారం మొక్కలకు నిప్పంటించారు. పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు. అధికారులు స్పందించి చెట్లను కాపాడే చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

బాసర ఆలయానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుతీరారు. మొక్కులు చెల్లించుకొని తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులు, చిన్నారులకు వృద్ధులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తాగునీరు అందజేశారు. దర్శనానికి 3 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయానికి వివిధ అర్జిత సేవా టికెట్ల ద్వారా రూ.15,457,60 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు.